సాక్షి
మెదక్

బుధవారం । 22 । మే । 2024



గింజకొంటే ఒట్టు..

ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు చర్యలు చేపట్టడంలో తాత్సారం చేస్తున్నారు. వివరాలు 8లో ▸



ఎస్‌ఐ భార్య నిరసన

కొమురవెల్లి పోలీస్ స్టేషన్ ఎదుట ఎస్‌ఐ భార్య మంగళవారం ఆందోళనకు దిగింది. తన భర్త రెండో పెళ్లి చేసుకొని ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయింది. వివరాలు 8లో ▸



మురికి కూపంగా చెరువు

పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని, ఆనందాన్ని పంచే చెరువు మురుగు కూపంగా తయారై దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం

● డీఆర్‌డీఓ శ్రీనివాసరావ్



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ

కౌడిపల్లి(నర్సాపూర్): రైతులు ఆందోళన చెందొద్దని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని డీఆర్‌డీఓ శ్రీనివాసరావ్ స్పష్టం చేశారు. మంగళవారం కౌడిపల్లి మండలం వెంకట్రావ్‌పేటలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. వరిధాన్యం కుప్పలు, తేమశాతం, తూకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షంలో తడిసిన ధాన్యం సైతం కొనుగోలు చేస్తామన్నారు. ప్రతి ధాన్యం గింజను కొంటామని చెప్పారు. లారీల సమస్యతో ధాన్యం తరలింపు ఆసల్యం కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం సంగమేశ్వర్, నిర్వాహకులు రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

● ట్రాన్స్‌కో ఏడీఈ మోహన్‌బాబు

మెదక్‌జోన్: మెదక్ మండలంలోని 5సబ్ స్టేషన్ల పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్టు ట్రాన్స్‌కో ఏడీఈ మోహన్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంబోజిపల్లి పరిధిలోని ఎన్‌డీఎస్‌ఎల్, ర్యాలమడుగు, పాతూరు, రాజ్‌పల్లి, మక్త భూపతిపూర్ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు చేపట్టనున్నామని, అందులో భాగంగా ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం జరుగుతుందని తెలిపారు. ఆ సబ్‌స్టేషన్ల పరిధిలో గల గ్రామాల ప్రజలు, రైతులు సహకరించాలని కోరారు.

23న స్పాట్ కౌన్సిలింగ్

నర్సాపూర్: తమ కాలేజీలో మిగిలిన సీట్లకుగాను స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు స్థానిక తెలంగాణ రాష్ట్ర గిరిజన గురుకుల బాలుర కాలేజీ ప్రిన్సిపాల్ భిక్షమయ్య తెలిపారు. మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులలో మిగిలిన సీట్లకు పదోతరగతి ఉత్తీర్ణులైన గిరిజన విద్యార్థులకు 23న స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్టు చెప్పారు. కౌన్సిలింగ్ కామారెడ్డి జిల్లాలోని నాగిరెడ్డిపేటలో ఉంటుందని, ఆరోజు ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు.


ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

చిన్నశంకరంపేట(మెదక్): ఆయిల్‌ఫామ్ రైతులు ఆధునిక పద్ధతులను పాటిస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని ఉద్యానశాఖ జిల్లా అధికారి నర్సయ్య పిలుపునిచ్చారు. నార్సింగి మండలంలోని నర్సంపల్లిలో ఆయిల్‌ఫామ్ సాగు చేస్తున్న రైతులకు డ్రిప్ సిస్టం ద్వారా ఎరువులు అందించే విధానంపై మంగళవారం అవగాహన కల్పించారు. అలాగే యాసిడ్ ట్రీట్‌మెంట్ విధానాన్ని క్షేత్రస్థాయిలో ప్రదర్శించి చూపారు. కార్యక్రమంలో క్లస్టర్‌లెవల్ హార్టికల్చర్ అధికారులు రామకృష్ణ, మౌనికారెడ్డి, సంతోష్ ఆయిల్‌ఫామ్ జిల్లా మేనేజర్ కృష్ణ, నార్సింగి ఏఈఓ విజృంభణ ఉన్నారు.

పల్లెప్రకృతి పనుల పరిశీలన




డంపింగ్ యార్డ్‌ను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ సతీశ్‌కుమార్

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నందిగామ గ్రామంలో డీఎల్‌పీఓ సతీశ్ కుమార్ పల్లె ప్రకృతి పనులను పరిశీలించారు. పంచాయితీ అసెట్స్ వెరిఫికేషన్‌లోభాగంగా హరితహారం నర్సరీ, పల్లె ప్రకృతివనం, తెలంగాణ క్రీడా ప్రాంగణం, వైకుంఠధామం, డంపింగ్ యార్డ్‌లను మంగళవారం సందర్శించారు. పంచాయతీ రికార్డ్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మొహమ్మద్ ఆరిఫ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

సన్నాల సాగు సులువేం కాదు

రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధరకు అదనంగా క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ పేర్కొనడంతో అన్నదాతల సంతోషానికి అవధుల్లేకుండా పోయింది. తీరా అధికారంలోకి వచ్చాక సన్నాలకు మాత్రమే బోనస్ ఇస్తామని, చెప్పడంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. సన్నాలు సాగు చాలా కష్టతరమైనది. ఎంతో శ్రమ, డబ్బు ఖర్చుపెట్టి పండించినా ఈ రకం ధాన్యానికి న్యాయం జరగడంలేదు. జిల్లాలో సన్నరకం ధాన్యాన్ని సాగుచేసేది 15శాతానికి మించి రైతులు ఉండరు. – మెదక్‌జోన్:



ఐదు నెలలకు నీటితడులు అందించాలి

- దొడ్డు రకంతో పోల్చితే నెలరోజులు అదనం
- తెగుళ్లదాడి అధికం.. మందులు వేస్తూనే ఉండాలి
- బోరుబావులపై ఆధారపడితే కష్టమే

మెదక్ జిల్లాలో చెప్పుకోదగ్గ సాగునీటి ప్రాజెక్టులు లేవు. ఏకైక మధ్యతరహా ప్రాజెక్టు ఘణాపూర్ ప్రాజెక్టుతోపాటు హల్దీప్రాజెక్టు, చిన్నా, చితకా చెరువులు కుంటలు మాత్రమే ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా సాగయ్యే విస్తీర్ణంలో 80శాతం బోరుబావుల ఆధారంగా వివిధ రకాల పంటలు సాగవుతుంటే కేవలం 20శాతం మాత్రమే సాగునీటి వనరుల ఆధారంగా పంటలు పండిస్తున్నారు. వర్షాలు పుష్కలంగా కురిసి, భూగర్భజలాలు పెరిగి బోరుబావుల్లో నీటి మట్టం పెరిగితేనే సాగు. లేకుంటే ఏమీలేని పరిస్థితి. దీనిని దృష్టిలో ఉంచుకుని రైతులు త్వరగా చేతికందే దొడ్డురకం వరినే సాగుచేస్తున్నారు.

సాగు చేయడం కష్టం..

ఈ ఏడాది యాసంగిలో జిల్లా వ్యాప్తంగా 2.64లక్షల ఎకరాలలో వరిపంటను సాగుచేశారు. అందులో రూ.2.24లక్షల ఎకరాలలో దొడ్డురకం సాగుచేశారు. కేవలం 40వేల ఎకరాలలో మాత్రమే సన్నరకం వరిపంటను సాగుచేశారు. అంటే 15శాతం మాత్రమే సన్నాలవరి సాగైంది. దొడ్డురకం వరి పంట నాటువేసిన నుంచి 120రోజుల్లో అంటే 4నెలల్లో పంట చేతికి అందుతుంది. సన్నరకం మాత్రం 150రోజులకు, 5నెలలకు చేతికి అందుతుంది. అందులోకి 80శాతం పంటలను బోరుబావుల ఆధారంగా సాగుచేస్తున్నారు. వరికి సకాలంలో నీరు పారించకుంటే ఎండిపోతుంది. దీంతో పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి ఉండదు. అందుకే రైతులు త్వరగా చేతికందే దొడ్డురకం పంటల సాగుకే మొగ్గు చూపుతున్నారు. అంతే కాకుండా సన్నరకం వరి పంటపై తెగుళ్ల దాడి కూడా అధికంగా ఉంటుంది. అగ్గితెగులు, కాటుక, మొగిపురుగు, కొక్కెర పురుగు, దోమకాటు, అగ్గితెగులు ఇలా అనేక రకాల తెగుళ్లు సన్నాలపై సులభంగా దాడిచేస్తాయి. దొడ్డురకంతో పోల్చుకుంటే మూడింతల తెగుళ్లు అధికమని రైతులు చెబుతున్నారు. తెగులు సోకిన వెంటనే గుర్తించి మందులను పిచికారీ చేయాలి. ఏ మాత్రం ఆలస్యం చేసినా పంట చేతికందే పరిస్థితి ఉండదు.

దిగుబడి తక్కువే..

దొడ్డురకం వరి దిగుబడితో పోల్చితే సన్నాల దిగుబడి చాలా తక్కువగానే ఉంటుంది. ఎకరానికి సాధారణంగా 25క్వింటాళ్ల దిగుబడి వస్తే, సన్నరకం 20క్వింటాళ్లకు మించదు. ఎకరానికి 5క్వింటాళ్ల తేడా ఉంటుంది. ప్రస్తుత మద్దతు ధరతో పోల్చితే రూ.10వేలు తక్కువగానే ఆదాయం వస్తుంది. డిమాండ్ ఉంటేనే సన్న రకానికి క్వింటాల్‌కు రూ.200నుంచి 300 అదనంగా లాభం వస్తుంది.

15శాతం రైతులకేనా లబ్ధి?

జిల్లాలో ప్రాజెక్టుల ఆధారంగా సాగునీరందే ఆయకట్టు ఉన్న భూములు కేవలం 15శాతం మాత్రమే. సన్నాల సాగుకు వారు మాత్రమే మొగ్గు చూపుతారు. మిగతా 85శాతం మంది రైతులు బోరుబావుల ఆధారంగా దొడ్డురకం వరిసాగు చేస్తారు. మొత్తంమీద సన్నాలు సాగుచేసే రైతులు 15శాతానికి మించరు.

అన్నివడ్లకు బోనస్ ఇవ్వాలి..



ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టు ప్రభుత్వం అన్నిరకాల వడ్లకు బోనస్ ఇవ్వాలి. సన్నాలకే ఇస్తాననడం సరైంది కాదు. సన్నాలు సాగు చేయాలంటే చాలా కష్టం.

– పోచమ్మ, రైతు

దొడ్డు వడ్ల ధరకే సన్నాలు అమ్మా



నాకున్న ఎకరంన్నర పొలంలో సన్నాలు సాగుచేశాను. ఓ రైస్‌మిల్లుకు తీసుకెళ్తే కేవలం దొడ్డురకం ధరకే కొనుగోలు చేశారు. చేసేదిలేక అమ్మాల్సి వచ్చింది.

– మల్లేశం, రైతు, జంగారాయి

తెగుళ్లతో నష్టమే మిగిలింది..



నాకున్న ఎకరంన్నర పొలంతో పాటు, మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని సన్నాలను సాగుచేశాను. తెగుళ్లు సోకడంతో ఐదుసార్లు మందులను పిచికారీ చేశాను. అది దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. అంత ఖర్చు పెట్టినా ఎకరాకు 15క్వింటాళ్ల చొప్పున మాత్రమే దిగుబడి వచ్చింది.

– శ్రీనివాస్‌రెడ్డి, రైతు

రైతులను మోసం చేసిన ప్రభుత్వం

● డీసీఎంఎస్ వైస్ చైర్మన్ రమేశ్ కుమార్



రమేశ్ కుమార్

కొల్చారం(నర్సాపూర్): వచ్చే వానాకాలం పంట నుంచి సన్నధాన్యాన్ని సాగుచేసే రైతులకు మాత్రమే రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడం రైతులను మోసం చేయడమేనని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ రమేశ్ కుమార్ ఆరోపించారు. మంగళవారం ఆయన రంగంపేట సొసైటీలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సన్నాలు సాగు వల్ల రైతులపై తీవ్ర ఆర్థిక భారం పడుతుందని, అందుకే దొడ్డు రకం సాగుకే ఎక్కువ మంది మొగ్గు చూపుతారని చెప్పారు. సన్నాలు సాగు చేసిన వారికే బోనస్ ఇస్తే మిగతా రైతులు నష్టపోతారని వాపోయారు. రైతులందరికీ బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

సీసీఎస్‌తో బంగారు భవిష్యత్

కార్పొరేట్ కళాశాలల్లో అవకాశం

- హాస్టల్ విద్యార్థులకు ఫస్ట్ ఛాన్స్
- ఇంటర్‌లో ఉచిత వసతి, ఎంసెట్ కోచింగ్
- ఈనెల 30న తుది గడువు
- ఎస్సీ, ఎస్టీ సంక్షేమశాఖ అధికారి విజయలక్ష్మి



మెదక్ కలెక్టరేట్: గ్రామీణ ప్రాంతాల్లో గల ప్రతిభావంతులైన విద్యార్థులను ఇంజనీర్లు, డాక్టర్లుగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం కార్పొరేట్ కళాశాల స్కీం(సీసీఎస్)ను తీసుకొచ్చిందని జిల్లా ఎస్సీ, ఎస్టీ సంక్షేమశాఖ అధికారి విజయలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె సాక్షితో మాట్లాడారు. ఈ స్కీమ్‌లో భాగంగా రాష్ట్రస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు ప్రభుత్వం ఎంపికచేసిన కార్పొరేట్ కళాశాలల్లో చేరేందుకు అవకాశం కల్పిస్తుందని చెప్పారు. ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షల్లో 7.5ఆపై జీపీఏ సాధించిన ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులంతా ఈ స్కీమ్‌లో చేరేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె తెలిపారు.

ప్రాధాన్యం..

కేజీబీవీ, గురుకులాలు, మోడల్‌స్కూల్, సోషల్ వెల్ఫేర్, నవోదయ, జెడ్పీహెచ్ఎస్, ఎయిడెడ్, ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు మాత్రమే అవకాశం ఉంటుంది. పదో తరగతిలో మెరిట్ ఆధారంగా అవకాశం కల్పిస్తారు. సోషల్ వెల్ఫేర్ విద్యార్థులకు 70 శాతం, ట్రైబల్ వెల్ఫేర్ విద్యార్థులకు 10శాతం బీసీ వెల్ఫేర్ విద్యార్థులకు 10శాతం, ఈబీసీలకు 10శాతం అవకాశాలు ఉన్నట్లు విజయలక్ష్మి తెలిపారు.

92శాతం ఉత్తీర్ణత

జిల్లాలో 20సంక్షేమ హాస్టళ్లు ఉన్నాయని, అలాగే ట్రైబల్-3, ఆశ్రమ పాఠశాలలు-3 ఉన్నట్లు ఆమె తెలిపారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులు 92శాతం ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. ఒక విద్యార్థి 10జీపీఏ సాధించగా ఆరుగురు 9.5జీపీఏ, 22మంది విద్యార్థులు 9.5వరకు జీపీఏ సాధించినట్లు తెలిపారు. అలాగే ఆరు ఎస్సీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

కార్పొరేట్ విద్య..

రాష్ట్రంలో ఉత్తమ ర్యాంకులు సాధిస్తున్న కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు రెండేళ్లపాటు ఉచిత వసతి, భోజనం, బోధనతోపాటు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, ఉచితంగా ఎంసెట్ కోచింగ్ కూడా ఇస్తారని చెప్పారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 7.5 ఆపై జీపీఏ సాధించిన విద్యార్థులు ఈనెల 30వ తేదీ వరకు httpr://teanfanaeparr.cff.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు 5 నుంచి 10కళాశాలలను ఎంపిక చేసుకోవాలని, జూన్ 3న దరఖాస్తుల వెరిఫికేషన్ ఉంటుందని తెలిపారు.

అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్..

ప్రభుత్వం అందజేసే అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లకు జిల్లా నుంచి ఇద్దరు దరఖాస్తు చేసుకున్నారని వారికి ఈనెల 27న ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు. ఈ పథకంలో ఎంపికైన వారికి ప్రభుత్వం రూ.20లక్షలు అందజేస్తుందని తెలిపారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

జిల్లా విద్యాధికారి రాధాకిషన్



మాట్లాడుతున్న డీఈవో రాధాకిషన్

రామాయంపేట(మెదక్): అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు నాణ్యంగా ఉండాలని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ సూచించారు. రామాయంపేట, నిజాంపేట మండలాలకు చెందిన హెచ్ఎంలకు మంగళవారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. రామాయంపేట మండలంలో 31, నిజాంపేట మండలంలో 19 స్కూళ్లకు ఈ పథకం కింద నిధులు మంజూరయ్యాయని, ఎంపిక చేసిన స్కూళ్లలో తాగునీటి సదుపాయం, విద్యుత్, టాయిలెట్ల మరమ్మతులకు ఈ నిధులను వినియోగించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ నెలాఖరులోగా పనులు పూర్తయితే పెయింటింగ్ కోసం స్టేట్ నుంచి టీంలు వస్తాయని, వినియోగించే పరికరాలు బ్రాండెడ్‌గా ఉండాలని డీఈవో ఆదేశించారు. సమావేశంలో రెండు మండలాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చర్యలు

జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు



తనిఖీలు నిర్వహిస్తున్న గోవిందు

రామాయంపేట(మెదక్): ఈ సీజన్‌లో రైతులకు ఎరువులు, విత్తనాల కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు తెలిపారు. రామాయంపేటలోని రైతు వేదికలో మంగళవారం జరిగిన రైతు సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ భూసారాన్ని పరిరక్షించడానికిగాను జిల్లాలో జనుము, జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈసారి జిల్లాలో 3.73లక్షల ఎకరాల మేర పంటలు సాగవుతాయని అంచనా వేస్తున్నామని, జిల్లాకు 64వందల క్వింటాళ్ల జనుము, జీలుగ విత్తనాలు కేటాయించారని చెప్పారు. రైతులు తొందరపడి ప్రస్తుతం కురుస్తున్న వర్షాలపై ఆధారపడి విత్తనాలు వేయవద్దని, తొలకరి వర్షాలు వచ్చే వరకు వేచిచూడాలని సూచించారు. రైతులు విత్తనాలతో పాటు ఎరువులను అధీకృత డీలర్లవద్ద మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. ఆయన పలు ఎరువులు, విత్తనాల దుకాణాలను తనిఖీ చేశారు. వసంత సుగుణ, రాజ్‌నారాయణ, సతీశ్, హరిప్రసాద్, బాల్‌రెడ్డి, విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు తలెత్తనీయం

- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు
- జిల్లా ప్రత్యేక అధికారి భారతీ హోళికేరి



నార్సింగిలో అధికారులకు సూచనలిస్తున్న జిల్లా ప్రత్యేక అధికారి భారతీ హోళికేరి

తూప్రాన్: ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని ఉమ్మడి మెదక్ జిల్లా స్పెషల్ అధికారి భారతీ హోళికేరి చెప్పారు. మంగళవారం మండలంలోని గుండ్రెడ్డిపల్లి, మల్కాపూర్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని కచ్చితంగా కొనుగోలు చేస్తామని చెప్పారు. అవసరం ఉన్న చోటకు ఎక్కువ లారీలు పంపించి తొందరగా రైస్ మిల్లులకు ధాన్యాన్ని తరలించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. సిబ్బంది సైతం తగిన ఏర్పాట్లు చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్డీఓ జయచంద్రారెడ్డి, తహసీల్దార్ విజయలక్ష్మి, ఐకేపీ ఏపీఎం రుక్మిణి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వేగవంతం చేయాలి..

చిన్నశంకరంపేట(మెదక్): ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని జిల్లా ప్రత్యేక అధికారి భారతీ హోళికేరి అధికారులను ఆదేశించారు. నార్సింగిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు ఎంత ధాన్యం తూకం వేశారు, ఇంకెంత వేయాల్సి ఉందని అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని వెంటనే తరలించేందుకు జిల్లా అధికారులు సమీక్షించాలని సూచించారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ కరీమ్ తదితరులు ఉన్నారు.

కౌంటింగ్‌లో సూపర్‌వైజర్ల పాత్ర కీలకం

- తప్పిదాలు లేకుండా నిర్వహించాలి
- కలెక్టర్ రాహుల్ రాజ్



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కలెక్టరేట్: ఓట్ల కౌంటింగ్ ప్రక్రియలో సూపర్‌వైజర్‌ల పాత్ర చాలా కీలకమని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో కౌంటింగ్ సూపర్‌వైజర్లకు మొదటి విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎటువంటి తప్పిదాలు జరగకుండా కౌంటింగ్ ప్రక్రియను పూర్తిచేయాలని సూచించారు. పార్లమెంట్ పరిధిలో ఏడు సెగ్మెంట్లకు 17టేబుల్స్ ఏర్పాటుచేసి పోస్టల్ కౌంటింగ్ చేపడుతున్నట్లు చెప్పారు. అలాగే జనరల్ కౌంటింగ్ నిర్వహణకు మెదక్ నియోజకవర్గానికి 20రౌండ్లు, నర్సాపూర్ నియోజకవర్గానికి 22రౌండ్ల ద్వారా కౌంటింగ్ చేపడుతున్నట్లు తెలిపారు. 14 పోలింగ్ స్టేషన్‌లకు 14టేబుల్స్ ఏర్పాటుచేసి లెక్కింపు జరుపుతామన్నారు. జూన్3న కౌంటింగ్ నిర్వహణపై రెండో విడత శిక్షణ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్‌ఓలు, మెదక్, నర్సాపూర్, తూప్రాన్ ఆర్డీఓలు రమాదేవి, శ్రీనివాస్, జైచంద్రారెడ్డి, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, అసిస్టెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

పది రోజుల్లో ధాన్యం సేకరణ పూర్తి

హవేళిఘణాపూర్(మెదక్): కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని పదిరోజుల్లో సేకరించేందుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు. మంగళవారం క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా మెదక్ మండలం మాచవరం ప్యాక్స్ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. త్వరితగతిన కొనుగోలు పూర్తిచేసి మిల్లుకు తరలించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 410 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఇప్పటి వరకు 44,685 రైతుల నుంచి 1,94,666 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.289.28 కోట్లు రైతుల ఖాత్లాలో జమ చేశారని చెప్పారు. ప్రస్తుతం సుమారు 600కు పైగా లారీలు అందుబాటులో ఉన్నాయని, ఇతర జిల్లాల కోసం మరో 150లారీలను ఏర్పాటు చేశామని చెప్పారు.

మత్తడిని మరమ్మతు చేయాలి

మండలంలోని అవుసులపల్లి వద్ద గల మత్తడి బుంగపడి ప్రయాణీకులకు తీవ్ర ఇబ్బందికరంగా మారిందని, దానికి మరమ్మతులు చేయించాలని నిజాంపేట జెడ్పీటీసీ, బీజేపీ నాయకులు పంజా విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం అవుసులపల్లి గ్రామ రైతులతో కలిసి కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి బ్రిడ్జి నిర్మించాలని కోరారు. జిల్లా కోశాధికారి నాగరాజు, లోకేశ్, రాములు, రాజు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

సెక్యూరిటీ బ్యూరో సుభాస్ చంద్రబోస్



అవగాహన కల్పిస్తున్న సుభాస్ చంద్రబోస్

మెదక్ మున్సిపాలిటీ: ప్రజలంతా సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని సైబర్ సెక్యూరిటీ బ్యూరో సుభాస్ చంద్రబోస్ పిలుపునిచ్చారు. సైబర్ నేరాలపై మెదక్, తూప్రాన్ డివిజన్ కార్యాలయాల్లో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్నెట్ ఆధారంగా జరిగే వ్యక్తిగత, ఆర్థిక, భద్రత పరమైన నేరాలను సైబర్ నేరాలు అంటారని వివరించారు. ఈ నేరాలు ఆన్ లైన్ ద్వారా సైబర్ క్షేత్రంలో జరుగుతాయని చెప్పారు. సైబర్ నేరాల గురించి 1930టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే జూన్ 8న మెగా లోక్‌అదాలత్ ఉన్నట్లు తెలిపారు. మెదక్, తూప్రాన్ డీఎస్పీలు రాజేశ్, వెంకట్‌రెడ్డి, సీఐలు, సైబర్ వారియర్స్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అగ్ని ప్రమాదంలో ఇల్లు, గడ్డివాము దగ్ధం

మంటలు ఆర్పేందుకు యత్నించిన యజమానికి గాయాలు



కాలిబూడిదైన రేకుల ఇల్లు

నారాయణఖేడ్: అగ్ని ప్రమాదంలో గడ్డి వాముతోపాటు ఓ రేకుల ఇల్లు దగ్ధమైంది. మంటలు ఆర్పేందుకు యత్నించిన యజమానికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలం పలుగుతండాలో జరిగింది. బాధితుడు, తండా వాసులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన నేనావత్ శంకర్‌నాయక్‌కు రేకులతో కూడిన ఇల్లు ఉంది. పక్కనే గడ్డివాము వేశాడు. సోమవారం సాయంత్రం గడ్డివాముకు మంటలు వ్యాపించి అది కాస్తా రేకుల ఇంటికి అంటుకున్నాయి. ఈ ఘటనలో ఇంట్లో ఉన్న బియ్యం, జొన్నలు, పప్పుదినుసులు, దుస్తులు దగ్ధమయ్యాయి. మొత్తం రూ. లక్ష వరకు నష్టం సంభవించింది. ఇంటి యజమాని శంకర్‌నాయక్ మంటలు ఆర్పేందుకు యత్నించి గాయాల పాలయ్యాడు. తండా వాసులు ఖేడ్ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఫైరింజన్ వచ్చేలోపే గడ్డివాము, ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. శంకర్‌నాయక్‌ను చికిత్స నిమిత్తం ఖేడ్ ప్రాంతీయ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతున్నాడు.

అస్థిపంజరం లభ్యం



గుర్తుతెలియని అస్థిపంజరం

పటాన్‌చెరు టౌన్: గుర్తు తెలియని అస్థిపంజరం లభ్యమైంది. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటరెడ్డి కథనం ప్రకారం... పటాన్‌చెరు మండలం రామేశ్వరంబండ గ్రామ శివారు.. గోపాలకృష్ణ వ్యవసాయ పొలం సమీపంలో మునగ చెట్టు కింద పూర్తిగా కుళ్లిన స్థితిలో అస్థిపంజరం సోమవారం లభ్యమైంది. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని దాన్ని పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతిచెందిన వ్యక్తి వయసు 45 సంవత్సరాలు ఉంటుందని, చనిపోయి 15 రోజులు అయ్యి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో ఎద్దులు మృతి




మృత్యువాత పడిన ఎద్దులు

హత్నూర(సంగారెడ్డి): విద్యుత్ షాక్ తో రెండు ఎద్లు మృతిచెందాయి. ఈ సంఘటన హత్నూరలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం .. హత్నూర గ్రామ శివారులో నివాసముంటున్న గంగిరెద్దుల వాళ్లకు రెండు ఎద్దులు ఉన్నాయి. ఇవి రోజులాగే సోమవారం కూడా బ్రాహ్మణగూడ గ్రామాల మధ్యలో ఉన్న కొండని గారి కుంట సమీపంలోకి వెళ్లి మేత మేస్తున్నాయి. ఇక్కడే లూజైన విద్యుత్ తీగలు తగిలి షాక్‌తో అక్కడికక్కడే మృతిచెందాయి. ఎంతకీ ఇంటికి రాకపోయేసరికి మంగళవారం వెతకగా ఉదయం మృత్యువాత పడి ఉన్నాయని స్థానికులు తెలిపారు.

గింజకొంటే ఒట్టు..

అకాల వర్షంతో తడిసిన ధాన్యానికి మొలకలు



ధాన్యం రాశులు

షేర్‌ఖాన్‌పల్లికి రైతు సంజీవ. తనకున్న 3 ఎకరాల్లో వరి సాగు చేశాడు. సుమారుగా 70 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. రూ.35 వేలకు పైగా పెట్టుబడి పెట్టాడు. అతను ధాన్యం కొనుగోలు కేంద్రం వద్దకు వడ్లు తీసుకువచ్చి ఆరబెట్టాడు. ఇప్పటి వరకు నిర్వాహకులు ఒక్క బస్తా కూడా తూకం వేయలేదు. వర్షాల కారణంగా ఎండిన ధాన్యం తడిసి ముద్దయింది. ప్రస్తుతం మొలకలు వచ్చాయి. ఇది ఇతని ఒక్కడి పరిస్థితే కాదు గ్రామంలోని రైతులు అందరిదీ కూడా ఇదే విధంగా ఉంది.

- 15 రోజుల క్రితం ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం
- నేటికీ షేర్‌ఖాన్‌పల్లిలో జరగని విక్రయాలు
- కూలీల కొరతే కారణమంటున్న అధికారి
- ఆందోళనలో రైతన్న

జిల్లాలో కొనుగోలు కేంద్రాల వద్ద వడ్ల కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుంది. రైతులు తెచ్చిన ధాన్యాన్ని నిర్వాహకులు తూకం వేసి కొంటున్నారు. కొంతలో కొంత రవాణా ద్వారా గోదాంలకు తరలిస్తున్నారు. కానీ హత్నూర మండలంలో అందుకు భిన్నంగా పరిస్థితులు ఉన్నాయి. షేర్‌ఖాన్‌పల్లిలో వరి రైతుల నుంచి గింజ కూడా కొనలేదు. అందుకు కారణం కూలీల కొరత అని చెబుతున్నారు అధికారి. రైతులేమో కొనుగోలు కేంద్రాల వద్దకు తరలించి 15 రోజులైందని వాపోతున్నారు. గింజ కూడా కొనకపోవడంతో ఎప్పుడు కొంటారోనని దీనంగా ఎదురు చూడాల్సిన పరిస్థితి ఇక్కడ కనిపిస్తోంది.

హత్నూర(సంగారెడ్డి):

అకాల వర్షాలకు ధాన్యం తడిసి మొలకలు వచ్చాయి. అయినా అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదని చెబుతున్నారు. అప్పులు తెచ్చి మరీ సాగు చేశామని కన్నీరు మున్నీరయ్యారు. చుట్టుపక్కల గ్రామాల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పంట కొనుగోలు చేస్తున్న అధికారులు షేర్‌ఖాన్‌పల్లిలో ఎందుకు కొనుగోలు చేయడం లేదని అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా కొనుగోలు ప్రారంభించకుంటే పూర్తిగా నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. హత్నూర మండలం షేర్‌ఖాన్‌పల్లిలో హత్నూర ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం(సొసైటీ) ఆధ్వర్యంలో ఈనెల 5న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అధికారులు ఆర్భాటంగా ప్రారంభించారు. కానీ ఇప్పటికే (40 రోజుల క్రితమే) రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రం వద్దకు తెచ్చి ఆరబెట్టారు. కేంద్రం ప్రారంభమై 15 రోజులు గడిచిపోయినా ఒక్క ధాన్యం బస్తా కూడా తూకం వేయలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా హత్నూర మండలంలోని ధాన్యం కేంద్రాల వద్ద కొనుగోళ్లు వేగవంతం చేయడం లేదని పలు గ్రామాల రైతులు పేర్కొంటున్నారు. గన్ని బ్యాగుల కొరత ఒక వైపు, లారీలు సక్రమంగా రాకపోవడంతో రోజుల తరబడి ధాన్యం విక్రయించేందుకు నిరీక్షించాల్సిన పరిస్థితి ఇంకో వైపు ఏర్పడింది. జిల్లా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేసేలా చూడాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు.

కారణం అదే : శ్రీనివాస్, సీఈఓ

హత్నూర మండలం షేర్‌ఖాన్‌పల్లి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద కూలీల కొరత వల్ల ఇంకా ధాన్యం కొనుగోలు ప్రారంభించలేదు. గ్రామంలో వరి కోతలు లేటుగా ప్రారంభమయ్యాయి. ఈనెల 5న కొనుగోలు కేంద్రం ప్రారంభించాం. కానీ కూలీల కొరత వల్లే ఇంకా కొనుగోలు చేయలేకపోయాం. ఒకటి.. రెండు రోజుల్లో ప్రారంభిస్తాం. గ్రామంలో రెండు మూడు లారీల లోడు మాత్రమే ధాన్యం నిల్వలు ఉన్నాయి.



కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం కుప్పలు

వడ్ల బస్తాలతో నిండిన సంగారెడ్డి మండలం హనుమాన్ నగర్ కొనుగోలు కేంద్రం



చలించండి మహాప్రభో..

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వడ్ల బస్తాలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. వచ్చిన వడ్లు వచ్చినట్లు బస్తాలుగా పేరుస్తున్నారు. ఇందుకు కారణం.. అవసరానికి తగినట్లుగా లారీలు అందుబాటులో లేకపోవడమే. దీంతో మిల్లులకు తరలించాలంటే రెండు లేక మూడు రోజుల వరకు ఎదురు చూడాల్సిందే. అక్కడ కూడా త్వరితగతిన ధాన్యం దించుకోవటం లేదని తెలుస్తోంది. పైగా మూడురోజులు వర్షం సూచన ఉన్నప్పటికీ అధికారులు ధాన్యం తరలింపుపై సరైన దృష్టి కేంద్రీకరించడం లేదని రైతులు వాపోతున్నారు.

సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి.



ధాన్యం బస్తాలను పేరుస్తున్న వ్యక్తి



అమ్మకానికి తెచ్చిన ధాన్యం

ప్రైవేటు బస్సు డ్రైవర్ ఉడాయింపు

- కనీస సౌకర్యాలపై నిలదీసిన ప్రయాణికులు
- గోవాకు వెళ్లలేకపోయిన 25 మంది

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బస్సులో కల్పించాల్సిన కనీస సదుపాయాలపై అడిగితే ప్రైవేటు బస్సు డ్రైవర్ ఉడాయించాడు. దీంతో ప్రయాణికులు గమ్యస్థానానికి చేరుకోలేకపోయారు. ఈ ఉదంతం రామచంద్రపురంలో ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్ నుంచి గోవాకు సోమవారం రాత్రి బయలుదేరే ఓంశ్రీ ట్రావెల్స్ బస్సుకు 25 మంది ప్రయాణికులు టికెట్ బుక్ చేసుకున్నారు. ఎల్‌బీనగర్‌లో బస్సు నిర్వాహకులు ప్రయాణికులను పిక్ అప్ చేసుకోవాల్సి ఉండగా మియాపూర్ వరకు రావాలని కోరారు. వారు ఇక్కడికే వచ్చి బస్సు ఎక్కారు. కానీ కనీస సౌకర్యాలు లేకపోవడం, లోపల అపరిశుభ్రంగా ఉండటం, వైర్లు బయటకి కనబడుతుండగా కొంతమంది ప్రయాణికులు డ్రైవరు దృష్టికి తీసుకెళ్లారు. అతను వారితో నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తూనే దురుసుగా ప్రవర్తించాడు. బస్సు రామచంద్రాపురం.. అశోక్‌నగర్ వద్దకు చేరుకోగానే డ్రైవరు వాహనాన్ని పక్కకు ఆపి దిగి వెళ్లిపోయే ప్రయత్నం చేశాడు. ప్రయాణికులు.. బస్సు నిర్వాహకుడు సునీల్ ఫోన్ చేయగా అతను కూడా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడు. వేరొక డ్రైవర్ వస్తాడన్నాడు. కానీ మంగళవారం ఉదయం వరకు చూసినా ఎవరూ రాలేదు. దీంతో బస్సు నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అయితే వైజాగ్‌కు చెందిన చరణ్ వర్మ బుధవారం గోవాలో జరిగే ఇండియాన్ కోస్ట్ గార్డు అసిస్టెంట్ కమాండెంట్ ఇంటర్వ్యూకు హాజరు కావాల్సి ఉండగా బస్సు ఇక్కడే ఆగిపోయింది. అయితే తోటి ప్రయాణికులు అందరూ కలిసి మంగళవారం రాత్రి గోవాకు వెళ్లేందు విమాన టికెట్‌ను బుక్ చేశారు. కాగా చరణ్ వర్మ అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.



బస్సు వద్ద ప్రయాణికులు

నాలుగో అంతస్తుపై నుంచి పడి ..

- కూలీ దుర్మరణం
- అమీన్‌పూర్ పీఎస్ పరిధిలో ఘటన

పటాన్‌చెరు టౌన్: నాలుగో అంతస్తుకు లిఫ్ట్ ద్వారా ఇటుకలు తరలిస్తుండగా ప్రమాదవశాత్తు కూలీ కింద పడి దుర్మరణం చెందాడు. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ సోమేశ్వరి కథనం ప్రకారం.. వెస్ట్ బెంగాల్‌కు చెందిన అరుణ్ లేట్(22) బతుకుదెరువు కోసం వచ్చి అమీన్‌పూర్‌కు వచ్చాడు. ఇక్కడి బిల్డర్ తేజరామ్.. పీజేఆర్ ఎంక్లేవ్ రోడ్ నంబర్ 7లో నూతనంగా నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్ వద్ద కూలీగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం పని చేసే చోట నాలుగో అంతస్తుకు ఇటుకలు తరలిస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడగా తీవ్ర గాయాలయ్యాయి. తోటి కార్మికుడు రంజన్ ఇతరులు కలిసి వెంటనే క్షతగాత్రుడిని చందనగర్ మెడికవర్ ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే అరుణ్ మృతిచెందినట్లు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బిల్డర్ ముందస్తు భద్రతా చర్యలు తీసుకోనందునే పై నుంచి కింద పడి చనిపోయాడని మృతుడి గ్రామస్తుడైన రంజన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ ఇసుక డంపు స్వాధీనం

మద్దూరు(హుస్నాబాద్): అక్రమ ఇసుక డంపుపై సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, మద్దూరు పోలీస్‌లు దాడులు నిర్వహించి సీజ్ చేశారు. మంగళవారం మద్దూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని జాలపల్లి గ్రామ శివారులో 150 టన్నుల డంపును నిల్వ చేశారని సమాచారం మేరకు ఈ దాడులు చేశారు. ఆపై డంపును సీజ్ చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు అక్రమ ఇసుక డంపును నిల్వ చేశారని అధికారులు తెలిపారు. అన్ని విధాలుగా విచారణ చేసి నిందితులను గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్న వారిపై ప్రజలు టాస్క్‌ఫోర్స్, పోలీసుల (87126-67445, 87126-67447, 87126-67446)కు సమాచారం అందించాలన్నారు. వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.



ఇసుక డంపును స్వాధీనం తీసుకున్న టాస్క్‌ఫోర్స్, పోలీస్ అధికారులు

వ్యక్తికి రిమాండ్

సిద్దిపేటకమాన్: ఇసుక అక్రమ రవాణా చేస్తూ పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట అర్బన్ మండలం వెంకటాపూర్‌కు చెందిన సంపంగి నవీన్ కొంతకాలంగా కరీంనగర్ జిల్లా రేణిగుంట వాగులో నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్నాడు. ఈ నెల 9న పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా వద్ద పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా అక్రమంగా ఇసుకను తరలిస్తూ అతను పట్టుబడ్డాడు. అయితే విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్‌ను నెట్టేసి అక్కడి నుంచి పారిపోయాడు. ఈ ఘటనపై కేసు నమోదు కాగా నిందితుడు మంగళవారం ఇసుక లారీతో సహా సిద్దిపేట టూటౌన్ స్టేషన్‌లో లొంగిపోయినట్లు సీఐ తెలిపారు. అతడిని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

రాష్ట్రంలో ఎఫ్ఆర్ఎస్‌ది రెండో స్థానం

- పండ్ల పెంపకంలో అత్యుత్తమ గుర్తింపు పొందింది
- కొండా లక్ష్మణ్ బాపూజీ వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ నీరజ

సంగారెడ్డి: అన్ని పండ్లలో రారాజు మామిడని, పండ్ల మొక్కల పెంపకంలో సంగారెడ్డి ఎఫ్ఆర్ఎస్ (ఫ్రూట్ రిసెర్చ్ సెంటర్) రాష్ట్రంలోనే రెండో స్థానంలో ఉందని కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ నీరజ పేర్కొన్నారు. మంగళవారం సంగారెడ్డి ఎఫ్ఆర్ఎస్‌లో ఫల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరై ఆమె ప్రసంగించారు. ప్రతి రైతూ మంచి మొక్కలను ఎంచుకొని నాటుకోవాలని సూచించారు. 242 రకాల పండ్లను ప్రదర్శనలో ఉంచామన్నారు. అధిక దిగుబడిలో దాసరి ముఖ్యమైనదని, మల్లిక లక్షల ఎకరాల్లో సాగవుతుందన్నారు. మంజీరా రకం పండ్ల తోటల పెంపకంలో మొదటి స్థానంలో ఉందన్నారు. పండ్ల తోటల మొక్కల పెంపకంలో కొత్త రకం ఎంపిక చేసే ముందు రిసెర్చ్ చేయాల్సి ఉందన్నారు. ఆ తర్వాత సత్ఫలితాల ఆధారంగా ఆమోద ముద్ర వేస్తామన్నారు. మొక్కల్లో తల్లి వేరు వ్యవస్థ బాగా లేకపోవడంతో చెట్లు పాడైపోతుంటాయన్నారు. వేరేగా మొక్కలను నాటుకోవాలని సూచించారు. కాగా, రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ప్రదర్శనలో కొండాపూర్ మండలం తేర్పోల్‌కు చెందిన రైతు నర్సింహారెడ్డి మాట్లాడుతూ తాను గతంలో ఒక నర్సరీలో మొక్కలు తెస్తే నిర్వాహకులు మోసం చేశారన్నారు. అదే ఎఫ్ఆర్ఎస్‌లో తెచ్చిన మొక్కల్లో అన్నీ బాగున్నాయన్నారు. ప్రభుత్వం పండ్ల తోటల పెంపకందారులకు రాయితీ కల్పించి ప్రోత్సహించాలని కోరారు. ఈ ప్రదర్శన బుధవారం సైతం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రిసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ కిరణ్ కుమార్, హార్టీకల్చర్ ఏడీఏ శ్రీధర్ , శాస్త్రవేత్తలు హరికాంత్, డాక్టర్ మాధవి, నితీష , హార్టికల్చర్ అధికారులు కీర్తి కృష్ణ, సమత పాల్గొన్నారు.



మామిడి పండ్ల ప్రదర్శనను తిలకిస్తున్న వైస్ చాన్స్‌లర్ నీరజ

బైక్‌ను ఢీకొన్న టిప్పర్ ఒకరికి తీవ్రగాయాలు

పోచారం సమీపంలో ఘటన

పటాన్‌చెరు టౌన్: బైకును టిప్పర్ ఢీకొన్న ఘటనలో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన పటాన్‌చెరు మండలం పోచారం సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... పోచారం సర్వీస్ రహదారి సమీపంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న కొండాపూర్ మండలం ఉత్తరపల్లికి చెందిన మహేందర్‌ను టిప్పర్ సోమవారం రాత్రి ఢీకొంది. దీంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించగా వారు ఇక్కడికి చేరుకున్నారు. వెంటనే పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు ప్రాథమిక చికిత్స అందజేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

రోకలిబండతో భార్య దాడి

భర్తకు తీవ్రగాయాలు.. పరిస్థితి విషమం

మనోహరాబాద్‌లో ఉదంతం

మనోహరాబాద్(తూప్రాన్): భార్యాభర్తల మధ్య గొడవ జరుగగా భర్తపై భార్య రోకలి బండతో దాడి చేసింది. దీంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మనోహరాబాద్‌లో జరిగింది. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పర్కిబండ పంచాయతీ.. తుపాకులపల్లి గ్రామానికి చెందిన నిమ్మల శివయాదవ్, తన భార్య ఇద్దరూ సోమవారం రాత్రి గొడవ పడ్డారు. కోపోద్రిక్తురాలైన భార్య రోకలిబండను తీసుకొని భర్త తలపై మోదింది. దీంతో అతడి తల పగిలి రక్తం కారుతుంది. గమనించిన చుట్టుపక్కల వారు బాధితుడిని వెంటనే తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉందని కుటుంబసభ్యులు తెలిపారు. ఈ గొడవపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

పీఎస్ ఎదుట ఎస్ఐ భార్య నిరసన



పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న ఎస్ఐ నాగరాజు మొదటి భార్య మానస, బంధువులు

న్యాయం చేయాలని వేడుకోలు

కొమురవెల్లి(సిద్దిపేట): సిద్దిపేట జిల్లా కొమురవెల్లి పోలీస్ స్టేషన్ ఎదుట ఎస్ఐ నాగరాజు భార్య మానస మంగళవారం ఆందోళనకు దిగింది. తన భర్త రెండో పెళ్లి చేసుకొని, ఇద్దరు కుమారులను తీసుకెళ్లాడని, న్యాయం చేయాలని కోరింది. బాధితురాలి కథనం ప్రకారం.. ఎస్ఐ నాగరాజు తనను పదేళ్ల క్రితం వివాహం చేసుకున్నారని మానస తెలిపింది. రెండేళ్ల నుంచి మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగించాడని, అనంతరం రెండో పెళ్లి చేసుకున్నాడని ఆరోపించారు. తన ఇద్దరు పిల్లను దూరం చేసి మరో సంసారం చేస్తూ తనకు అన్యాయం చేస్తున్నాడని వాపోయింది. రెండేళ్ల క్రితం కరీంనగర్‌లో పెట్టి తన ఇద్దరు పిల్లలను తీసుకెళ్లి విడాకులు ఇవ్వాలని ఇబ్బందులకు గురి చేస్తున్నాడని అన్నారు. దీంతో తాను ఆత్మహత్యకు యత్నించగా.. పిల్లలను తనకు ఇప్పించి న్యాయం చేస్తామని బంధువులు చెప్పడంతో విరమించినట్లు తెలిపింది. ఈ విషయమై సిద్దిపేట సీపీ, చేర్యాల సీఐ, కరీంనగర్ మహిళ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేసింది. తన భర్తకు ఫోన్ చేస్తే నంబర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టాడని పేర్కొంది. బంధువులతో కలిసి కొమురవెల్లి పోలీస్ స్టేషన్‌కు రాగా ఎస్ఐ ఆరు రోజులుగా సెలవులో ఉన్నాడని చెప్పారని తెలిపింది. తనకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తానని చెప్పింది. సీఐ శ్రీనివాస్ వివరణ కోరగా.. ఇటీవల మానస ఈ విషయం తన దృష్టికి తీసుకువచ్చిందని, కౌన్సెలింగ్ ఇచ్చామని, ఉన్నత అధికారుల ఆదేశానుసారంగా చర్యలు తీసుకుంటామన్నారు.

ఆస్తి పంపకాల విషయంలో మనస్తాపం

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

దుబ్బాకరూరల్: ఆస్తి పంపకాల విషయంలో మనస్తాపానికి గురై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని రామక్కపేటలో జరిగింది. ఎస్ఐ గంగరాజ్ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన రంగు సత్యం(45)కు, కుటుంబ సభ్యులకు మధ్య ఆస్తి పంపకాల విషయమై మంగళవారం తెల్లవారుజాము 2 గంటల సమయంలో గొడవ జరిగింది. ఈ విషయంలో మనస్తాపానికి గురై అతను మధ్యాహ్నం 2 గంటలకు ఇంటిలో ఉన్న తన పిల్లలను బయటకు పంపించి తలుపులు వేసుకొని ఫ్యాన్‌కు చీర బిగించి ఉరి వేసుకున్నాడు. ఈ విషయాన్ని తన పిల్లలు ఇంటి బయట బీడీలు చుడుతున్న తల్లి లావణ్యకు చెప్పారు. ఆమె ఇరుగు పొరుగు వారిని పిలిచి తలుపులు తెరిచారు. ఫ్యాన్‌కు వేలాడుతున్న సత్యంను కిందకు దింపి దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



సత్యం(ఫైల్)